క్లుప్తంగా

విద్యార్థుల సంఖ్యను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న జీసీడీఓ స్నేహలత

మద్దికెర: ఆదర్శ పాఠశాలల్లోని వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి రోజు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా జీసీడీఓ (గరల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) స్నేహలత సూచించారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయంతో పాటు వారు ఎంత సంఖ్యలో ఉన్నారో తప్పనిసరిగా రికార్డులతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈవిషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సవిత ఉన్నారు.

ఉరుసుకు ముస్తాబు



తుగ్గలి : మండలంలోని చెన్నంపల్లి పురాతన కోట కింద భాగంలో వెలసిన హజరత్ సయ్యద్ షా శవాసప్ప స్వామి దర్గా ఉర్సు ఈనెల 24 నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉరుసుకు చెన్నపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి దర్గాను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. 24న గంధోత్సవం, 25న ఉర్సు, 26 జియారత్ కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్తులు మంగళవారం తెలిపారు.

పంచాయతీ కాంప్లెక్స్ ప్రారంభం



పంచాయతీ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్

మద్దికెర : స్థానిక ప్రధాన బజారులో నిర్మించిన పంచాయతీ కాంప్లెక్స్, బొమ్మనపల్లిలో సీసీ రోడ్డును మంగళవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సముదాయాన్ని ఒకే చోట నిర్మించడంతో ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుహాసిని, తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్, డీఈ శేషయ్య, ఏఈలు విష్ణు, చంద్రశేఖర్, ఈఓ శివకుమార్, తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ రాజన్న, బండారు ఆంజనేయులు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



రైతు సంఘం డైరీ ఆవిష్కరిస్తున్న ఏఓ, సీపీఐ, రైతు సంఘం ప్రతినిధులు

వెల్దుర్తి: సీపీఐ అనుబంధ రైతు సంఘం-2025 డైరీ ఆవిష్కరణ స్థానిక ఆర్‌ఎస్‌కేలో మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏఓ అక్బర్‌బాషా చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, రైతు సంఘం కార్యదర్శి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, చిన్నమాదులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఏఓ మాట్లాడుతూ రైతన్న డైరీ రైతులకందించేలా చూడాలని సీపీఐ, అనుబంధ సంఘాలను కోరారు.

కంది పంట దగ్ధం



రోళ్లపాడు వద్ద పొలంలో దగ్ధమైన కంది పంట

తుగ్గలి : మండల పరిధిలోని రోళ్లపాడులో నిప్పు అంటుకొని కంది పంట దగ్ధమైంది. రైతు ఆనంద్ తనకున్న ఆరెకరాల్లో కంది పంట సాగు చేశారు. రెండు రోజులు క్రితం పంట కోతకోసి నూర్పిడి కోసం పొలంలో కుప్పవేశాడు. అయితే, మంగళవారం పొలం సమీపంలోని గుట్టలోంచి మంటలు వ్యాపించి పంటంతా దగ్ధమైనట్లు రైతు ఆనంద్ తెలిపారు. ఎవరైనా నిప్పు పెట్టారా లేక ప్రమాదవశాత్తూ జరిగిందా అనేది తెలియాల్సి ఉంది. దాదాపు రూ.2లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయారు. ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరారు.

ప్రయాణం సాగేదెట్టా!



పెరవలి నుంచి ఆర్ కొట్టాలకు వెళ్లే దారి



పూర్తిగా దెబ్బతిన్న రామాపురం రోడ్డు

అధ్వానంగా కనిపిస్తున్న ఈ రహదారులు మద్దికెర మండలం పెరవలి నుంచి ఆర్ కొట్టాలకు వెళ్లేదొకటి, అక్కడి నుంచి రామాపురం వెళ్లేది మరొకటి. దాదాపు ఈ రెండు రోడ్లు నాలుగైదు కిలోమీటర్ల మేర గుంతలు పడి, ముళ్లకంపతో నిండిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఎన్నికల ముందు రోడ్లను అభివృది చేస్తామని గొప్పలు చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఏడునెలలు గడిచినా అతీగతీ లేదు. ఈ మట్టి రోడ్లకు బీటీ రోడ్లుగా మోక్షమెప్పుడు కలుగుతుందో, తమకు రహదారి కష్టాలు ఎన్నడు తీరుతాయోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. –తుగ్గలి

ప్రమాదం తొంగి చూస్తోంది

హొళగుంద మండలంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. దాదాపు 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన స్తంభాలను సైతం నేటికి మార్చకపోవడంతో సిమెంట్ పెచ్చులు ఊడి ఇనుప కడ్డీలు బయటపడ్డాయి. కొన్ని చోట్ల నేలకొరిగాయి. శ్రీరాంనగర్ క్యాంపు పక్కన, తెక్కలకోట రస్తా తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది. హెవీ కెపాసిటీ కలిగిన తీగలున్న ఈ స్తంభాలు కూలితే ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉందని, విద్యుత్ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. –హొళగుంద



హొళగుంద సమీపంలోని పొలంలో కడ్డీలు బయటకు తేలిన విద్యుత్ స్తంభం

వామ్మో..వంతెన



అలారుదిన్నె బ్రిడ్జికి ఒక వైపు కూలిపోయిన రక్షణ గోడ

ఇది మండలంలోని వలగొండ గ్రామం దగ్గర ఉన్న అలాదుదిన్నె బ్రిడ్జి. వాగుపై రాకపోకలకు ఇబ్బందిగా ఉందని 1940వ సంవత్సరంలో అప్పటి మద్రాస్ గవర్నమెంట్ దీనిని నిర్మించింది. వంతెన కట్టి 80 ఏళ్లు దాటిపోవడంతో రక్షణ గోడ దెబ్బతిని కూలిపోయింది. వాహనదారులు వెళ్లేటప్పుడు ఆదమరిచితే వాగులోని నీటిలో పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలువురు అదుపుతప్పి పడిపోయి గాయాలపాలయ్యారు.ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రక్షణ గోడ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆస్పరి మండల ప్రజలు కోరుతున్నారు. –ఆస్పరి

పప్పు శనగ దిగుబడి ధమాల్



రామచంద్రాపురంలో పప్పుశనగ దిగుబడి అంచనా వేస్తున్న వ్యవసాయ అధికారులు

పత్తికొండ(తుగ్గలి) : ప్రతికూల వాతావరణంతో ఈ ఏడాది పప్పుశనగ దిగుబడి దారుణంగా తగ్గిపోయింది. మంగళవారం మండలంలోని రామచంద్రాపురం రైతు రామకృష్ణ పొలంలో 5గీ5 మీటర్ల పొడవు, వెడల్పులో పప్పుశనగ పంట ప్రయోగం చేయగా 1.960 కేజీ దిగుబడి వచ్చింది. ఈ లెక్కన ఎకరాకు సాధారణ దిగుబడి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా పంట కోత ప్రయోగాల తర్వాత ఎకరాకు 3.17 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చినట్లు డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి రవి ప్రకాష్ మోసెస్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రియాజ్‌బాషా, ఏఎస్‌వో సంజీవ్, ఎంపీఈవో రాధాబాయి, వీఎస్‌ఏ సావిత్రి, తెలుగు రైతు సంఘం పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకుల జోక్యం సరికాదు



పత్తికొండలో ఏపీఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

పత్తికొండ(తుగ్గలి) : వలసలు నివారించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో అధికార పార్టీ నాయకుల జోక్యం మితిమీరిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆరోపించారు. ఉపాధి పథకంలో నాయకుల పెత్తనాన్ని పక్కనపెట్టి పనిచేసిన కూలీలకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ మంగళవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబీరసూల్‌తో కలిసి ఏపీఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపని పనులు చేసిన వారికి కూడా సకాలంలో వేతనాలు అందడం లేదన్నారు. దీంతో వేలాది మంది కూలీలు ఇప్పటికే సుదూర ప్రాంతాలకు పిల్లాపాపలతో వలస వెళ్లారన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని, కూలీలకు రోజుకు వేతనం రూ.600, మేట్లకు గౌరవ వేతనం రూ.500 చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం తాలూకా, మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, వీరన్న, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, గురుదాస్, ఏటీయూసీ, రైతు సంఘం నాయకులు నెట్టికంటయ్య, సిద్దు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

దేవనకొండ: గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాధ్యక్షుడు బి.వీరశేఖర్ అన్నారు. వలసలు–ఉపాధిపై ఈనెల 23వ తేదీన ఆదోని పట్టణంలో సదస్సు జరుగనుంది. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం దేవనకొండలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదోని సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ, సిబ్బంది, అధికారులు హాజరవుతారన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలసలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు వారికి ఉపాధి పనులు కల్పించి, గిట్టుబాటు వేతనం ఇవ్వలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు యూసుఫ్‌బాషా, సీఐటీయూ నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ లెనిన్‌కు నివాళి



కామ్రేడ్ లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆస్పరి: మండలకేంద్రం ఆస్పరిలో మంగళవారం కామ్రేడ్ లెనిన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులునాయకులు రమేష్, లక్ష్మన్న, దస్తగిరి, సుధాకర్, భాస్కర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి): ఒక నాటి సోవియట్ యూనియన్‌లో శ్రామిక, కార్మిక, అట్టడుగు వర్గాల కోసం లెనిన్ కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో ఉద్యమిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య అన్నారు. లెనిన్ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సోవియట్ విప్లవం ప్రపంచ గమనాన్ని మార్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గిడ్డయ్య, శేఖర్,భీమలింగప్ప, నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.

పగిడిరాయిలో దేవర ప్రారంభం



పగిడిరాయిలో పూజలందుకుంటున్న అంకాలమ్మ దేవత

తుగ్గలి: పగిడిరాయిలో వెలసిన అంకాలమ్మ, గుండమయ్య, గుండమ్మ దేవతల దేవర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి, సర్పంచ్ సౌజన్య, గౌరవ సలహాదారుడు బోడబండ హనుమంతుతో కలిసి ఆలయాలకు వెళ్లి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, వాల్మీకి సోదరులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

నేడు ఎమ్మెల్యే కేఈ, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి రాక..

దేవర ఉత్సవాల సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పగిడిరాయికి విచ్చేయనున్నట్లు ఆయా పార్టీల నాయకులు తెలిపారు.

తూతూ మంత్రంగా మండల మీట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వరలక్ష్మి

హాలహర్వి: మండల కేంద్రమైన హాలహర్విలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. ఎంపీపీ నెట్టికంటమ్మ అధ్యక్షతన నిర్వహిచిన ఈ సమావేశంలో అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంపై స్థానిక ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. అధికారుల తీరులో మార్పు రాకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని ఎంపీడీఓ వరలక్ష్మి హెచ్చరించారు. ఎంఈఓ ఈరన్న, ఏఓ శివశంకర్, జెడ్పీటీసీ లింగప్ప, వైస్ ఎంపీపీ పక్కీరమ్మ, ఏపీఓ చక్రవర్తి, వెటర్నరీ డాక్టర్ అశోక్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చందన, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఈరోజు

కుంభోత్సవానికి హాజరుకానున్న ఎమ్మెల్యే

హాలహర్వి: మండలంలోని మెదేహాల్ గ్రామంలో బుధవారం జరిగే దేవమ్మ, సుంకులమ్మ కుంభోత్సవం కార్యక్రమానికి ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవార్లకు పూజలు చేసి ఎమ్మెల్యే మొక్కులు తీర్చుకుంటారన్నారు.

పాలక వర్గ సమావేశం

ఆలూరు: మండలంలోని మొలగవెల్లి గ్రామ పంచాయతీ పాలక వర్గ సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి గ్రామంలోని అన్ని వార్డుల సభ్యులు , ఉప సర్పంచ్ , సచివాలయ ఉద్యోగులు,శానిటేషన్ సిబ్బంది హాజరుకావాలని పీఎస్ వెంకటనాయకుడు కోరారు.

విన్నపం

అక్రమాలను అరికట్టాలి



మైనర్ ఇరిగేషన్ ఏఈ రంగడుకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని వెంగళాయిదొడ్డి చెరువులో జరిగే అక్రమాలను అరికట్టాలని సాగు నీటి సంఘం అధ్యక్షుడు బసవరాజు, చెరువు పరివాహక ప్రాంత పరిరక్షణ కమిటీ సభ్యులు వీరభద్రి, వీరేష్, తిక్కయ్య, రామాంజినేయులు కోరారు. మంగళవారం ఈ చెరువును పరిశీలించేందుకు వచ్చిన మైనర్ ఇరిగేషన్ ఏఈ రంగడుకు వారు కలిసి వినతి పత్రం ఇచ్చారు. చెరువును ఆక్రమించుకోవడమే కాక అందులోని ఇసుకను ఇష్టానుసారంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. చెరువు గట్టు, కుడి, ఎడమ కాలువల్లో ఉన్న ముళ్ల కంపలను తొలగించి రైతుల భూములకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

పత్తికొండ(తుగ్గలి) : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో వరుసగా సమీరా, రంజిత్, రవితేజ, ఉపన్యాస పోటీల్లో గీత, అప్సర, రవితేజ విజేతలుగా నిలిచినట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

రామకృష్ణ ఎంపికపై హర్షం

పత్తికొండ(తుగ్గలి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ ఎంపిక పట్ల ఆపార్టీ నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గోవర్ధన్‌నాయుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండి మల్లికార్జున, జిల్లా కార్యదర్శి బ్రహ్మయ్య, తుగ్గలి మండల అధ్యక్షుడు లక్ష్మణస్వామి మంగళవారం నూతన జిల్లా అధ్యక్షుడు రామకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న శిక్షణ

దేవనకొండ: మండలకేంద్రంలో వలంటరీ టీచర్లకు శిక్షణ కొనసాగుతోంది. ఒక వలంటరీ టీచర్ 10 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాల్సి ఉంటుందని ఏపీఎం ఎం.నరసన్న తెలిపారు. వారికి ఎలా చదువు చెప్పాలనే దానిపై శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. వయోజనులకు సంబంధించి పుస్తకాలు, వారి అటెండెన్స్, వలంటరీ టీచర్‌కు సంబంధించిన మార్గదర్శిని బుక్స్‌ను పంపిణీ చేశారు.

26న మాదిగ సంఘం ఉద్యోగుల సమావేశం

ఆలూరు: ఈనెల 26వ తేది మాదిగ సంఘం ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం ఆలూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఆలూరు లో విలేకరులతో మాట్లాడారు. మాదిగ ఉద్యోగుల సమస్యలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



పులిచెర్ల గ్రామంలో పొలాన్ని పరిశీలిస్తున్న పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్

కృష్ణగిరి: రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ తెలిపారు. మండల పరిధిలోని కటారుకొండ గ్రామ పంచాయతీలోని పులిచెర్ల గ్రామంలోని కొందరు రైతులు తమ పొలాన్ని ఓ వ్యక్తి పేరు మీద ఉందని విచారించి న్యాయం చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై మంగళవారం విచారణకు వచ్చిన ఆర్డీఓ మాట్లాడుతూ ఈ సమస్యపై ఇది వరకే తహసీల్దార్ ఆధ్వర్యంలో పరిశీలించి సదరు రైతులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ భూ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం కృష్ణగిరి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మ్యూటేషన్, ఫ్రీహోల్డ్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రీసర్వేను పగడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వో వెంకటేశ్వర్లు ఉన్నారు.

సిద్ధేశ్వరస్వామి జాతరకు సన్నద్ధం



హొళగుంద సిద్ధేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో జేసీబీతో ముళ్లకంపలు తొలగిస్తున్న దృశ్యం

హొళగుంద: వచ్చే నెల 7 నుంచి మూడు రోజుల పాటు జరిగే హొళగుంద సిద్ధేశ్వరస్వామి జాతర జరుగనుంది. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, గ్రామ సర్పంచ్ చలవాది రంగమ్మ ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం స్థానిక తేరుబజారు, సిద్ధేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. ముళ్లకంపలు, పొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు.

తుంగభద్ర ఎల్లెల్సీ కాలువ పరిశీలన

హాలహర్వి: తుంగభద్ర ఎల్లెల్సీ కాలువను డీసీసీ చైర్మన్ మిక్కిలి ప్రసాద్, ఎల్లెల్సీ ఎస్‌డీవో హసన్‌బాషా, డీఈ షఫీవుల్లా మంగళవారం పరిశీలించారు. వేసవి కాలం పంటలకు నీటి ఇబ్బందులు లేకుండా దిగువ కాలువ కింద పిల్ల కాలువలకు త్వరలో మరమ్మతులు చేపడతామని చెప్పారు. హాలహర్వి, హొళగుంద మండలాల్లో ప్రవహిస్తున్న దిగువ కాలువపై పర్యటించారు.

చివరి ఆయకట్టు వరకు సాగు నీరందాలి

హొళగుంద: ఎల్లెల్సీ హొళగుంద-1 డిస్ట్రిబ్యూటరీల పరిధిలో వచ్చే పొలాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ఆ డిస్ట్రిబ్యూటరీ కమిటీ సాగు నీటి సంఘం అధ్యక్షుడు మిక్కిలినేని వెంకట శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన టీబీ బోర్డు, టీబీపీ డీఈఈలు మహమద్ షఫి, హసన్‌షేక్‌తో కలిసి కాలువ పై పర్యటించారు.

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు, గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి నవీన్ సూచించారు. మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో మంగళవారం ఆయన పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఇందులో పశువులకు సాధారణ పరీక్షలు చేసి వైద్యం అందించారు. అలాగే పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, ఆవులకు కృత్రిమ గర్భధారణ, పశువులకు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వెల్దుర్తి: గ్రామాల్లో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను రైతులు, పశు పోషకులు ఉపయోగించుకోవాలని వెల్దుర్తి, పుల్లగుమ్మి పశువైద్యాధికారులు శాంతలత, స్వాతి కోరారు. మంగళవారం వారి ఆధ్వర్యంలో మల్లెపల్లె, గోవర్ధనగిరి గ్రామాల్లో శిబిరాలను నిర్వహించి పశువులకు, జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

మారెమ్మ తల్లికి పూజలు



పుట్లూరులో పూజలందుకుంటున్న మారెమ్మ అమ్మవారు

కృష్ణగిరి: మండలంలోని అమ్మవార్ల దేవాలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్లూరు గ్రామంలోని మారెమ్మ, ఎస్‌హెచ్ ఎర్రగుడి, కంబాలపాడు గ్రామాల్లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామానికి చెందిన రవిశెట్టి సతీమణి రమణమ్మ పదిరోజుల క్రితం రామళ్లకోట రోడ్డులో ఆటో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆమె కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయం తెలుసుకున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ఫుట్‌బాల్ విజేత ఫలక్‌నుమా జట్టు

• రన్నర్‌గా నిలిచిన ఎమ్మిగనూరు జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న తహసీల్దార్, నిర్వాహకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నీలకంఠేశ్వరస్వామి మహారథోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన అంతర్‌రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో హైదరాబాద్ ఫలక్‌నుమా జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఎమ్మిగనూరుకు చెందిన వైఎఫ్‌ఏ జట్టు నిలిచింది. మంగళవారం విజేత జట్టుకు తహసీల్దార్ శేషఫణి, విద్యుత్ శాఖ డీఈ నాగేంద్రప్రసాద్, హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, చిత్రలేఖ, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి ట్రోఫీతో పాటు రూ.1.50 లక్షల నగదు బహుమతి అందజేశారు. అలాగే రన్నర్ జట్టుకు రూ.లక్ష, మూడో స్థానంలో నిలిచిన గోల్డెన్ హైదరాబాద్ జట్టుకు రూ.50వేలు, నాల్గో బహుమతిగా రూ.25వేలను చైతన్య ఎఫ్సీ జట్టుకు అందజేశారు. నిర్వాహకుడు రామకృష్ణనాయుడు, కౌన్సిలర్లు రామ్‌దాస్‌గౌడ్, ఇషాక్, అమాన్, మహేంద్రబాబు, భాస్కర్, బందె నవాజ్ పాల్గొన్నారు.